



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 309 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | శనివారం 11 జూలై 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :309 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | SAT 11 JULY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే.. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా

- డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లనున్న మాజీ ప్రధాని షేక్ హసీనా
- కోర్టు ఎదుట లొంగిపోతానని సంచలన ప్రకటన
- తనతో పాటు అవామీ లీగ్ సీనియర్ నేతలు కూడా వస్తారని వెల్లడి
- 2024లో ప్రజా ఉద్యమంతో పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం

- మిగతా 2లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం!



## చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవిగో!

**సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం**
రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్, రెస్పాన్స్ సెల్ ఏర్పాటు
ఫోరెన్సిక్ టూల్స్‌తో దుర్వినియోగాన్ని అరికట్టడం

**రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**
13 ప్రాజెక్టులకు ఆమోదం
31,431 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు

**అమరావతి రైతులకు గుడ్ న్యూస్**
వార్షిక కౌలు పెంపు: మెట్టకు రూ.40 వేలు,
జరీబుకు రూ.60 వేలు... 10 సంవత్సరాలు చెల్లింపు

**ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మంచి అవకాశం**
మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
ఐఐటీ, నీట్, జేఈఈకు అత్యుత్తమ శిక్షణ

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ**
కాన్సర్ట్స్, కార్నివాల్స్‌కు రూ.2 నుంచి రూ.5 కోట్ల వరకు
ఆర్థిక సహాయం.. ప్రభుత్వ మైదానాల ఉచితం

**సాగునీటి ప్రాజెక్టులకు ఆమోదం**
పెద్దగడ్డ ప్రాజెక్టుకు ఆమోదం
చెరువుల నీటికి రూ.67.98 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**
పుల్లడిగుంటలో 200 కుటుంబాలకు పట్టాలు
మార్చి 2027 నాటికి అన్ని రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**
విశాఖలో NIA కోర్టు, టీడీపీ కార్యాలయాలకు భూములు
రైతుల ధాన్యం సేకరణకు రూ.1800 కోట్ల రుణం

- మిగతా 2లో

## పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

- ఏపీలో ఆటోమోటివ్, ఈవీ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పుంగనూరులో ఈవీ క్లస్టర్, గ్రీన్ కారిడార్లలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
- కొరియా సంస్థల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్ పార్కులు
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో రేర్ ఎర్త్ కారిడార్ నిర్మాణం
- సియోల్‌లో కొరియా ఆటో పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగం లో దేశానికే హబ్‌గా మార్చేం దుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన "సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0" కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో

- మిగతా 2లో



## రష్యా చమురు క్షేత్రాలపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి.. తీవ్ర ఇంధన సంక్షోభం!

- ఉక్రెయిన్ దాడుల్లో రష్యాలోని ఆరు చమురు డిపోలు ధ్వంసం
- రష్యాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఇంధన కొరత
- 73 ఉక్రేనియన్ డ్రోన్లను కూల్చేశామన్న రష్యా
- 72 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నామన్న ఉక్రెయిన్

- మిగతా 2లో

## ఒకే స్క్రిప్ట్‌తో... ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు



- పవన్‌ను లక్ష్యంగా చేసుకుని జడా శ్రావణ్, ప్రకాశ్ రాజ్, రావణ్ కుట్ర అంటూ మంత్రి ఫైర్
- వీరి వెనుక వైసీపీ, తాడేపల్లి స్క్రిప్ట్ ఉందని కందుల దుర్గేశ్ ఆరోపణ
- జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో శ్రావణ్ చెప్పాలని డిమాండ్
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే మత ఘర్షణలు రెచ్చగొడుతున్నారని ఫైర్
- ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడమేనా అని తీవ్ర విమర్శ

- మిగతా 2లో

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

### గవర్నర్‌కు బొత్స లేఖ



- జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స
- విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం
- విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం. ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత

- మిగతా 2లో

## ఇరాన్ ప్రియతమ నేతకు కన్నీటి వీడ్కోలు..

### ఖమేనీ అంతిమయాత్రకు 4 కోట్లకు పైగా జనం



- మషద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రంలో ఖననం
- ఆరు రోజుల పాటు జరిగిన అంతిమయాత్రకు 4.3 కోట్ల వరకు జనం హాజరు
- ఇరాన్‌తో పాటు ఇరాక్‌లోనూ భారీగా పాల్గొన్న ప్రజలు

- మిగతా 2లో



## ఒకరికి మించి భార్యలుంటే ప్రభుత్వ ఉద్యోగం ఊస్ట్..

### అసోంలో కొత్త నిబంధనలు

- బహుభార్యత్వం పాటిస్తే ప్రభుత్వ పథకాలకు అనర్హులు
- ఇద్దరు భార్యలున్న ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయం
- అసోం 2026-27 బడ్జెట్‌లో ఈమేరకు కీలక ప్రతిపాదనలు
- మహిళా సాధికారత కోసమే ఈ చర్యలని ప్రభుత్వం స్పష్టీకరణ

- మిగతా 2లో

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీపీసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం



- పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్
- ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

- మిగతా 2లో

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు

- నాకు తెలంగాణే మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే పార్టీ అన్న ఈటల
- ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుబట్టడం దుర్మార్గమని కాంగ్రెస్‌పై విమర్శలు
- కాళేశ్వరం వల్లే ఉత్తర తెలంగాణలో రెండు పంటలు సాధ్యమయ్యాయని వ్యాఖ్య
- ప్రాజెక్టుల మరమ్మతుల్లో జాప్యం చేస్తే తీవ్ర కరవు వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన..

- మిగతా 2లో



## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని...

### మోదీకి ఘనస్వాగతం

- మూడు దేశాల పర్యటనలో భాగంగా అక్లాండ్ చేరుకున్న ప్రధాని మోదీ
- దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అక్కడ పర్యటిస్తున్న ఓ భారత ప్రధాని
- ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి స్వయంగా స్వాగతం పలికిన ప్రధాని క్రిస్టఫర్ లక్సన్
- వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై ఇరు దేశాల ప్రధానుల మధ్య చర్చలు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఎల్‌నినో హెచ్చరికల మధ్య ఖరీఫ్ సంక్షోభం

## కరువు కాటుకు రైతాంగం విలవిల...

### ఇక ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన కదలాలి

వ్యవసాయ ఆధారిత రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమే తీవ్ర అనిశ్చితితో మొదలైంది. ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినప్పటికీ, ఆ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు అవసరమైన స్థాయిలో ముందస్తు ప్రణాళికలు రూపొందించలేకపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొన్ని పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రచారం చేసినప్పటికీ, వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి.జూన్ నెల ముగిసే సమయానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక జిల్లాల్లో నేల తడవకపోవడం ఆందోళన కలిగించే అంశం. తెలంగాణలో సగటుతో పోలిస్తే సుమారు 58 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 63 శాతం వరకు వర్షపాతం లోటు నమోదైంది. ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన తొలి నెలలోనే ఇంతటి వర్షాభావం ఏర్పడటం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గత శతాబ్దానికి పైగా ఇలాంటి పరిస్థితి అరుదుగా కనిపించిందని వ్యవసాయ నిపుణులు, రైతులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ రంగం రెండు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 80 లక్షల ఎకరాలు, తెలంగాణలో దాదాపు 68 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుంది. ఉద్యాన, కూరగాయల పంటలను కలుపుకుంటే కోటి ఎకరాలకు పైగా సాగు ఈ సీజన్‌పై ఆధారపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తొలి దశలోనే వర్షాభావం ఏర్పడటం మొత్తం వ్యవసాయ చక్రాన్నే దెబ్బతీసే ప్రమాదం ఉంది.

నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించి కొద్దిపాటి వర్షాలు కురిపించిన తర్వాత మళ్లీ బలహీనపడటంతో రైతులు విత్తనాలు వేసేందుకు కూడా వెనుకంజ వేస్తున్నారు. ధైర్యం చేసి విత్తనాలు చల్లిన రైతులకు కూడా మొలకలు రాక పెట్టుబడులు వృథా అవుతున్నాయి. ప్రభుత్వాలు పంపిణీ చేసిన రాయితీ విత్తనాలు గోదాముల్లో నిల్వ ఉండిపోవడం, కొంతమంది రైతులు వాటిని నూనె గింజలుగా విక్రయించే పరిస్థితి రావడం వ్యవసాయ సంక్షోభానికి నిదర్శనం.రాయలసీమతో పాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ వంటి వర్షాధార ప్రాంతాల్లో వేరుశెనగ, పత్తి, కంది, జొన్న, సజ్జ వంటి పంటల సాగు పూర్తిగా వర్షాలపై ఆధారపడి ఉంటుంది. వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. పంటలు వేయలేకపోవడం, వేసిన పంటలు మొలకెత్తకపోవడం, కూలీలకు వ్యవసాయ పనులు లేక నిర్మాణ రంగంలోకి వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.నీటి వనరుల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు. ఎగువ రాష్ట్రాల్లో కూడా నిల్వలు తక్కువగా ఉండటంతో సాగునీటి భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. గోదావరి వరదలు రాకపోతే పట్టిసీమ ద్వారా కూడా తగినంత నీటి సరఫరా కష్టమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.భూగర్భ జలాలు ఇప్పటికే ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. వరుసగా వర్షాభావం కొనసాగితే తాగునీటి సమస్య కూడా తీవ్రమయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ బోర్లలో నీరు లేకపోతే రైతుకు ప్రయోజనం ఉండదు. పశుగ్రాసం కొరతతో పాడి పరిశ్రమ కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. పచ్చిగడ్డి లేక రైతులు అధిక ధరలకు దాణా కొనాల్సి వస్తోంది. దీని ప్రభావం పాల ఉత్పత్తుల ధరలపై కూడా పడుతుంది.కరువు ప్రభావం కేవలం వ్యవసాయానికే పరిమితం కాదు. గ్రామీణ ఉపాధి తగ్గిపోవడం, వలసలు పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడటం, తాగునీటి సమస్యలు, పశుసంపద నష్టం వంటి అనేక సామాజిక, ఆర్థిక సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి కరువును కేవలం ప్రకృతి విపత్తుగా కాకుండా సమగ్ర అభివృద్ధి సమస్యగా ప్రభుత్వాలు పరిగణించాలి.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. వర్షాభావ జిల్లాలను వెంటనే గుర్తించి కరువు ప్రకటించేందుకు అవసరమైన సర్వేలు పూర్తి చేయాలి. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి. రైతులకు ఉచితంగా లేదా రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి. ఉపాధి హామీ పథకాన్ని విస్తృతంగా అమలు చేసి గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలి. వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి. పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకోవాలి. తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. అవసరమైతే రైతులు తీసుకున్న పంట రుణాలకు వాయిదా, వడ్డీ రాయితీ, తీవ్ర నష్టపోయిన ప్రాంతాల్లో రుణమాఫీ వంటి చర్యలను కూడా పరిశీలించాలి.

ఎల్‌నినోను ఎవరూ అడ్డుకోలేరు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించే సమర్థవంతమైన పరిపాలన మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటుంది. ప్రకృతి విపత్తును ప్రజా విపత్తుగా మారనీయకుండా ముందస్తు ప్రణాళిక, సమన్వయం, వేగవంతమైన చర్యలతో రైతాంగానికి అండగా నిలవాల్సిన సమయం ఇదే. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే కరువు నివారణను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వాలు వెంటనే కార్యాచరణ ప్రారంభించాలి. ఇదే నేటి అత్యవసర అవసరం

## ఇరాన్ ప్రియతమ నేతకు కన్నీటి వీడ్కోలు..

ఇరాన్ అధినేత అయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంత్యక్రియలు ముగిశాయి. ఆరు రోజుల పాటు జరిగిన అంతిమయాత్ర అనంతరం, మషద్ నగరంలోని పవిత్ర ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో ఆయన పార్థివ దేహాన్ని ఖననం చేశారు. ఇరాన్, ఇరాక్‌లలో జరిగిన ఈ అంతిమ యాత్ర కార్యక్రమాలలో సుమారు 4.1 కోట్ల నుంచి 4.3 కోట్ల మంది ప్రజలు పాల్గొన్నారని అంచనా. అంతిమ సంస్కారాలకు ముందు ఖమేనీ భౌతికకాయాన్ని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రం చుట్టూ ప్రదక్షిణ చేయించి, డార్ అల్-ధిక్ర్ ప్రార్థనా మందిరంలో ఖననం చేశారు. పాయంబర్-ఎ-ఆజం ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో చివరి వీడ్కోలు కార్యక్రమం జరిగింది. మషద్ నగరంలో జరిగిన అంతిమయాత్రలో వీధులన్నీ జనసంద్రంగా మారాయి. ఊహించని రీతిలో జనం పోటెత్తడంతో సమీప రహదారులపై కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాల్సి వచ్చింది. ఇరాన్‌కు చెందిన 'ఫార్స్ న్యూస్ ఏజెన్సీ' కథనం ప్రకారం టెహ్రాన్, ఖోమ్, నజాఫ్, కర్బలా, మషద్‌లలో జరిగిన కార్యక్రమాలకు హాజరైన వారి సంఖ్యను రవాణా రికార్డులు, మొబైల్ ఫోన్ డేటా, క్రౌడ్-డెన్సిటీ విశ్లేషణల ఆధారంగా అంచనా వేశారు. ఒక్క ఇరాక్‌లోని నజాఫ్, కర్బలాల్లోనే దాదాపు కోటి మంది పాల్గొన్నారని ఆ దేశ అధికారులు ధ్రువీకరించారు. గత శుక్రవారం ప్రారంభమైన ఈ నివాళి కార్యక్రమాలలో 45కు పైగా దేశాల ప్రతినిధులు, 90కి పైగా దేశాల నుంచి పండితులు పాల్గొన్నారు. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, భారత్, టర్కీ, నైజీరియా వంటి దేశాల నుంచి కూడా ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై 40 రోజుల యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఉగ్రదాడికి పాల్పడ్డాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ దాడిలోనే ఖమేనీ, ఆయన అల్లుడు, ఒక కుమార్తె, 14 నెలల మనవరాలు, అలాగే నూతన అధినేత అయతొల్లా సయ్యద్ ముజ్తబా ఖమేనీ భార్య కూడా అమరులయ్యారు.

## ఒకరికి మించి భార్యలుంటే ప్రభుత్వ ఉద్యోగం ఊస్ట్..

బహుభార్యత్వంపై అసోం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది భార్యలు ఉన్నవారికి ఇకపై ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవని స్పష్టం చేసింది. అంతేకాకుండా, బహుభార్యత్వం పాటిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ప్రవేశపెట్టిన 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు చేసింది.అసోం ఆర్థిక మంత్రి జయంత మల్లా బారువా శుక్రవారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బహుభార్యత్వం పాటిస్తున్న ఏ పురుషుడైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు అనర్హుడవుతారని ఆయన సభకు వెల్లడించారు. మహిళా సాధికారత, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీనికోసం 'అసోం సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ అప్పీల్) రూల్స్-1964'కు సవరణలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సైతం ఒక మీడియా సమావేశంలో ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు.బహుభార్యత్వాన్ని అరికట్టేందుకు అసోం ప్రభుత్వం గత కొంతకాలంగా కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా 2025 నవంబర్‌లోనే "అసోం బహుభార్యత్వ నిషేధ బిల్లు, 2025"ను అసెంబ్లీలో ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం, మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకోవడం నేరం. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అయితే, కొన్ని షెడ్యూల్డ్ తెగలకు, ఆరో షెడ్యూల్ ప్రాంతాలకు ఈ చట్టం నుంచి మినహాయింపు కల్పించారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...

# చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవిగో!

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం**

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.

ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు**

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు.

అలాగే, గ్రామ కంతాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ**

ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅఎవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ**

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**

అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.

విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.

రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.

తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.

హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.

కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని...

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు న్యూజిలాండ్‌లో అడుగుపెట్టారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలను ముగించుకుని ఆయన శుక్రవారం ఆక్లాండ్‌కు చేరుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ స్వయంగా మోదీకి సాదర స్వాగతం పలికారు.రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని మోదీ, లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ భేటీలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవలే పురోగతి సాధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి కూడా ప్రసంగించనున్నారు.భారత్ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మహాసాగర్' విజన్‌ను బలోపేతం చేయడంతో పాటు, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల తమ నిబద్ధతను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుందని మోదీ తన పర్యటనకు ముందు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో లక్సన్ జరిపిన భారత పర్యటనతో వచ్చిన సానుకూలతను ఈ పర్యటన

మరింత ముందుకు తీసుకెళుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని మోదీ రక్షణ, సముద్ర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, భారత్‌కు యురేనియం సరఫరాకు వీలు కల్పించే కీలకమైన పౌర అణు ఇంధన ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుముందు ఇండోనేషియా పర్యటనలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత వంటి అంశాలపై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు.

## ఒకే స్క్రిప్ట్‌తో... ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని, అందులో భాగంగానే జడా శ్రావణ్ కుమార్, నటుడు ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ జోసెఫ్ రావణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేశ్ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురూ తాడేపల్లి నుంచి వస్తున్న ఒకే స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావుల ముసుగులో వీరు చేస్తున్న ప్రయత్నాలు, వైఎస్ జగన్‌తో జడా శ్రావణ్ భేటీ కావడంతో బట్టబయలయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్, జడా శ్రావణ్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సూటి ప్రశ్నలు సంధించారు. "జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు సొంత డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పిన శ్రావణ్‌కు అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తక్కువ కాలం జడ్జిగా పనిచేసి, తర్వాత సాధారణ న్యాయవాదిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి అంత డబ్బు ఎలా వస్తుంది? మాకు తెలిసిన సమాచారం ప్రకారం, అవినీతి కేసుల్లో ఉండటం వల్లే ఆయన జడ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన మాట వాస్తవం కాదా?" అని దుర్గేశ్ నిలదీశారు. పవన్ కల్యాణ్ ఏనాడూ శ్రావణ్ ప్రస్తావన తేకపోయినా, కేవలం వైసీపీ ఆదేశాలతోనే శ్రావణ్ పదేపదే పవన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు.జోసెఫ్ రావణ్, శ్రావణ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఉన్న 'క్యాష్ బంధం' ఏంటో బయటపెట్టాలని దుర్గేశ్ డిమాండ్ చేశారు. "రావణ్‌ను అరెస్ట్ చేస్తే శ్రావణ్ ఎందుకు అంతగా ఇబ్బంది పడుతున్నారు? ప్రశ్నించే హక్కు అంటే బూతులు తిట్టడమేనా? వ్యక్తిత్వ హననం చేసేవారిని వెనకేసుకు రావడమేనా మీ పని?" అని ప్రశ్నించారు. ఈ ముగ్గురూ కలిసి ఏపీలో క్రైస్తవులను రెచ్చగొట్టి మతాల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక వైసీపీ ఎజెండా స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు.ప్రకాశ్ రాజ్ గురించి మాట్లాడుతూ, "కర్ణాటకలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంపై, అక్కడి ఆచారాలపై ఆయన చేసిన విమర్శలు అందరికీ తెలుసు. ఆ కుట్ర కేసులో అరెస్ట్ అయిన చిన్నయ్య అనే వ్యక్తి, ప్రకాశ్ రాజ్ చీకటి కోణాన్ని బయటపెట్టాడు. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికే ప్రకాశ్ రాజ్ ఏపీలో ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడు" అని దుర్గేశ్ ఆరోపించారు.

పవన్ కల్యాణ్

ఆదాయంపై శ్రావణ్ చేస్తున్న విమర్శలను దుర్గేశ్ తిప్పికొట్టారు. "ఒక పెద్ద హీరో సినిమా పూర్తికావడానికి రెండు, మూడు సంవత్సరాలు పడుతుంది. 2024 ఎన్నికల అఫిడవిట్‌లో పవన్ తన ఆదాయ వివరాలను స్పష్టంగా పేర్కొన్నారు. అయినా కొత్త వాదనలు తేవడం విడ్డూరం. పవన్‌ను ఒక కులానికో, మతానికో పరిమితం చేయాలని, సనాతన ధర్మంపై దుర్మార్గపు మాటలు మాట్లాడాలని వీరందరికీ తాడేపల్లి నుంచే స్క్రిప్ట్ వస్తోంది" అని దుర్గేశ్ విమర్శించారు. రోజురోజుకీ బలోపేతం అవుతున్న కూటమి ప్రభుత్వాన్ని బలహీనపరిచి, అస్థిరపరచడమే వీరి ఏకైక ధ్యేయమని ఆరోపించారు. ఈ కుట్రను తాము తప్పనిసరిగా ఎదుర్కొంటామని, ప్రజా క్షేత్రంలో వారి ముసుగు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రష్యా చమురు క్షేత్రాలపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి.. తీవ్ర ఇంధన సంక్షోభం!

రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ దాడులను ముమ్మరం చేసింది. రష్యాలోని స్టావ్‌రోపోల్, ట్వెర్, ఉఫా ప్రాంతాలతో పాటు క్రిమియాలోని కీలక చమురు పంపింగ్ స్టేషన్‌లను తమ దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించడానికి మాస్కో నిరాకరిస్తుండడం వల్లే ఈ దాడులు పెంచామని, రష్యా వెనక్కి తగ్గే వరకు ప్రతిరోజూ అక్కడ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తామని ఆయన హెచ్చరించారు.నిన్న రాత్రి నుంచి ఈ తెల్లవారుజాము వరకు కొనసాగిన ఈ దాడుల్లో రష్యాలోని దాదాపు ఆరు చమురు డిపోలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అజోవ్ సముద్రంలోని రెండు చమురు ట్యాంకర్లపై కూడా డ్రోన్లు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల ప్రభావంతో రష్యాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర పెట్రోల్ కొరత ఏర్పడింది. ఇంధనం కోసం వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.తాము 73 ఉక్రేనియన్ డ్రోన్‌లను కూల్చివేశామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మరోవైపు, నిన్న రాత్రి రష్యా దళాలు తమపై ప్రయోగించిన 94 డ్రోన్‌లు, రెండు బాలిస్టిక్ క్షిపణులలో 72 డ్రోన్‌లను సమర్థవంతంగా అడ్డుకున్నామని ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. ఈ పరస్పర దాడులతో ఇరు దేశాల మధ్య యుద్ధం సరికొత్త స్థాయికి చేరింది.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు.పదేళ్లు అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు.నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే.. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు."వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి" అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు.2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

# గంజాయి, పోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన

- విద్యార్థులకు చదువుతోపాటు చట్టాలు, సైబర్ మోసాలపై అవగాహన అవసరం.
- జి మాడుగుల సిఐ లక్ష్మణరావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 10.** కళాశాల విద్యార్థులు గంజాయి సైబర్ మో సలు మైన ర్ డ్రైవింగ్ రహదారి భద్రత ఫోక్సో చట్టంపై ప్రతి ఒక విద్యార్థి చదువుతోపాటు అవగాహన కలిగి ఉండాలని జిమాడుగుల సిఐ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహాలను ఆయన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిఐ లక్ష్మణరావు విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైందని విద్య ఉన్నత స్థానంలో తీసుకుని వెళుతుందని చదువుపై విద్యార్థి దృష్టి సారించాలని ఆయన అన్నారు. యువత గంజాయి మత్తుకు బానిస కాకూడదని లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చట్టరీత్యా నేరమవుతుందని ఆయన అన్నారు. రహదారి భద్రత ఫోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. చట్ట విరుద్ధ కార్యక్రమాల వైపు విద్యార్థులు దృష్టి సారించటం చట్టరీత్య నేరమవుతుందని అలాంటి వారిపైచర్యలు తప్పవుఅన్నారు. గంజాయి మత్తు వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని వాటిని అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకోరాదని పలు సూచనలు సలహాలు అందించారు. కళాశాలలో తల్లితండ్రులు దేనికి చేర్పించరో అర్థం చేసుకుని చదువు మీద దృష్టి సారించి మంచిగా విద్య నేర్చుకొని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన విద్యార్థులకు పలు సూచనల సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి నాని కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం ।అనకాపల్లి। అల్లూరి జిల్లా

# గడువులోగా ఓటరు సవరణ ప్రక్రియ పూర్తి కావాలి.



- అధికారులకు జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశం.
- చింతపల్లి మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటన.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 10.** మండలంలో చేపట్టిన ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె చింతపల్లి మండలంలోని లంబసింగి, కిటుములు, తాజంగి, కొత్తపాలెం తదితర పంచాయతీలలో సుడిగాలి పర్యటన చేపట్టారు.

కిటుముల పంచాయతీ కేంద్రంలో పర్యటించిన ఆమె, సచివాలయాల్లో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులతో పాటు బూత్ స్థాయి సిబ్బంది చేపడుతున్న ఓటరు నమోదు ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ,ఈ నెల 14వ తేదీతో ఓటరు నమోదు కార్యక్రమం గడువు ముగియనున్న నేపథ్యంలో, పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో శ్రమించాలని సూచించారు. అలాగే, ప్రతి సచివాలయంలోనూ డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ త్రివేణి, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విమ్స్‌లో ఎ పి సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 10:** ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం పి.ఏ. నాయుడు గగురువారం విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాల పనితీరు, పరిపాలనా రికార్డులు మరియు సమాచార హక్కు చట్టానికి సంబంధించిన 4(1)దీ సమాచార రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా విమ్స్ అప్లియేట్ అథారిటీ మరియు డైరెక్టర్ డా. వి. మన్మధ రావు కమిషనర్‌కు ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పరిపాలనా వ్యవస్థ,రికార్డుల నిర్వహణ తదితర అంశాలను వివరించారు.

కమిషనర్ పి.ఏ. నాయుడు వివిధ శాఖలకు సంబంధించిన రిజిస్టర్ 1 మరియు రిజిస్టర్ 2 ఫైళ్లు, రికార్డులు మరియు సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించిన పత్రాలను ప్రజా సంబంధ అధికారి మరియు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ ను ఆదేశించి క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం అన్ని రికార్డులు నిబంధనలకు అనుగుణంగా, సక్రమంగా నిర్వహించబడుతున్నాయని అన్నారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత, క్రమబద్ధత మరియు బాధ్యతాయుత విధానాన్ని అనుసరిస్తున్నందుకు విమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. విమ్స్ నందు ప్రత్యేకంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కు బదులు గవర్నింగ్ బాడీ విమ్స్ అభివృద్ధి కార్యక్రమాలు నిర్దేశించడం వంటి ప్రత్యేకమైన అంశాలు 4(1)దీ సమాచారంలో ఉండడాన్ని గుర్తించారు. మరియు విమ్స్ వెబ్సైట్ నందు సమాచారం ఉండడాన్ని అభినందించారు. ప్రజలకు బాధ్యతాయుత పాలనను అందించడానికి, కార్యాలయాలు పారదర్శకంగా పనిచేయడానికి సమాచార హక్కు చట్టం ముఖ్యమైన సాధనమని రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఆర్టిఐ కమిషనర్ తెలిపారు. విమ్స్ అభివృద్ధి చెందినట్లయితే ఉత్తరాంధ్ర తో పాటు రాష్ట్ర ప్రజలకు ఉన్నత స్థాయి ప్రమాణాలతో ప్రజలకు వైద్యం అందుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ డా. మన్మధ రావు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు పరిపాలనలో పారదర్శకతకు విమ్స్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సమాచార హక్కు చట్టం నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పరిపాలనా అధికారులు, వివిధ విభాగాల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కొనసాగుతున్న పశుగ్రాస వారోత్సవాలు

- ముందస్తు వర్షాధార విత్తన పద్ధతిపై రైతులు అవగాహన కలిగి ఉండాలి.
- మండల పశు వైద్యాధికారి రవికుమార్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 10.** మండలంలో పశుగ్రాస వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈనెల 07 నుంచి కొనసాగుతున్న ఈ వారోత్సవం 14న ముగిస్తుందని మండల పశువైద్యాధికారి లావాటి ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీల గ్రామాలలో గిరిజన రైతులకు పిఎండిఎస్ ముందస్తు వర్షాధార పొడి విత్తన పద్ధతిపై వ్యవసాయ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్య పరిరక్షణ ఉత్పాదకత పెంపు దాణా ఖర్చుల తగ్గింపుపై ప్రతి ఒక్క రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. పశుపోషక రైతుల జీవనోపాధి మెరుగుదలకు పశుగ్రాస అభివృద్ధి ఏడాది పొడవునా పోషక విలువలతో కూడిన పచ్చి పశు గ్రాసం అందుబాటులో ఏవిధంగా భద్రపరచుకోవాలో వాటిపై పలు సూచనలు ఇచ్చారు. మెరుగైన పశుపోషణ నిర్వహణ ఆర్థిక ప్రయోజనాల కోసం రైతులు పిఏండిఎస్ పద్ధతులను స్థిరమైన పశుగ్రాస సాగు విధానాలను పాటిస్తే మంచి లాభాలు ఉంటుందని ఆయన వివరించారు. అలాగే పశు గ్రాస వారోత్సవాలో భాగంగా మండల వ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.





# అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే దృష్టికి పలు మండల సమస్యలు...!

- మండల సమస్యలను తెలియపరుస్తున్న వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు బిడిజన అప్పారావు

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 10 :** అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజ రాణి(ఎంపీ) అలాగే పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజును కలిసి న వైసీపీ పార్టీ నాయకులు. కొయ్యూరు మండలం, బుదరాళ్ళ పంచాయితీ పరిధిలోని గల గొర్లిమెట్ట పాఠశాల (స్కూల్) దుస్థితి మరియు ఇతర స్థానిక సమస్యలను అలాగే కొయ్యూరు మండలం లో ఉన్న నీటి సమస్య పై. ఎంపీ ఎమ్మెల్యే ల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది అని వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు విడిజన అప్పారావు తెలిపారు.

అలాగే బుదరాళ్ళ సూపర్ ఎంపిటిసి వంతల నారాయణ , వైసిపి నేతలు గాంధీ, ప్రకాష్, చిన్నారావు

ఎంపీ , ఎమ్మెల్యే లను కలవడం జరిగింది బుదరాళ్ళ గొర్లిమెట్ట , చిడిపల్లి,స్కూల్ భవనాలు పాడైపోయిన తీరు, పిల్లలు పడుతున్న ఇబ్బందులను స్పష్టంగా సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఎంపీ ఎమ్మెల్యే లు సానుకూలంగా స్పందించి,తప్ప కుండా చెస్తాము హామి ఇచ్చారు ప్రత్యేకంగా ఎంపీ గుమ్మా తానూజరాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు కి గొర్లిమెట్ట ,చిడిపాల్లి,గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు .

# 13 వ వార్డులో రెవెన్యూ సదస్స






**ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సదస్సులు**

**రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం :**

**జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ళ విద్యాధరి వెల్లడి**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 10:** తూర్పు నియోజకవర్గం 13వ వార్డు ఆరిలోవ చివరి బస్టాప్ జీవీఎంసీ కళ్యాణ మండపం వద్ద విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ళ విద్యాధరి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో జీవో నెంబర్ 296 మరియు 388 ద్వారా చంద్రన్న పట్టాలు ఇచ్చామని తర్వాత వచ్చిన ప్రభుత్వం దానిని పక్కన పెట్టడం జరిగిందని,ఇప్పుడు కూటమి ప్రభుత్వం ద్వారా చంద్రన్న పట్టాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తూ, అలాగే ఎవరైనా చంద్రన్న పట్టాకు అర్హులై ఉండి గతంలో తీసుకోలేకపోతే జీవో నెంబర్ 30 కింద మరలా దరఖాస్తు చేసుకోవాలని,చంద్రన్న పట్టాలో సర్వే నెంబర్,డోర్ నెంబర్,హద్దులు,పేర్లు నమోదులో తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు.శ్రీ కృష్ణాపురం, ఎస్.ఎస్.ఎస్ ఎన్ నగర్,రామకృష్ణాపురం గ్రామాలకు సంబంధించి సర్వేనెంబర్ 26 వాటర్ వర్క్స్ లో ఉండటం వలన వారికి గతంలో చంద్రన్న పట్టాలు తిరస్కరించడం జరిగిందని,ఇప్పుడు కలెక్టర్ మండల తహసీల్దార్ , జీవీఎంసీ కమిషనర్ అధ్యక్షతన మాట్లాడి ఫైల్ ను అమరావతికి పంపించడం జరిగిందని త్వరలో వీరికి కూడా యాజమాన్య హక్కులు చంద్రన్న పట్టా ద్వారా కల్పిస్తామని భరోసా ఇవ్వటం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రీవెన్స్ లో పెట్టినప్రతీ దరఖాస్తును పరిశీలించి అర్హత కలిగిన దరఖాస్తుదారులకు వెంటనే న్యాయం చేస్తామని, అధికారులందరినీ ఒకే వేదిక పైకి తీసుకొని వచ్చి సమస్యలను పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేసిందని, ఈ సదస్సులో 231 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని చెప్పడం జరిగింది.,ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డిఓ సంగీత్ మాధుర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరావు,అర్బన్ తహసీల్దార్ ప్రసాద్,రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, పార్లమెంట్ అధికార ప్రతినిధి పాత్రకండ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు



## జిల్లా కలెక్టర్ కార్యాలయం, జీవీఎంసీలో సమాచార హక్కు చట్టం అమలుపై రాష్ట్ర సమాచార కమిషనర్ సమీక్ష





**విశాఖపట్నం, జూలై 10 (పెన్ పవర్):** ఒక్కరోజు పర్యటనలో భాగంగా రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు శుక్రవారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కార్యాలయాన్ని సందర్శించి సమాచార హక్కు చట్టం--2005 (ఆర్టీఐ) అమలు తీరును పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు విధానం, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, అప్పీల్స్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత రికార్డులు, దస్త్రాలను తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.
అనంతరం జీవీఎంసీ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్, అక్కడ ఆర్టీఐ చట్టం అమలు తీరు, దరఖాస్తుల పరిష్కార విధానం, సమాచారాన్ని అందించే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సమాచారాన్ని చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోపు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.
ఈ పర్యటనలో జిల్లా పరిపాలన, జీవీఎంసీకి చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి - అరకు మహాగర్జనకు వాలంటీర్ల పిలుపు

- భారీగా తరలిరావాలని జీకే వీధి మండల నాయకుల విజ్ఞప్తి



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలిలో ఈ నెల 14వ తేదీ (మంగళవారం) నిర్వహించనున్న వాలంటీర్ల మహాగర్జనకు జీకే వీధి మండల పరిధిలోని 16 పంచాయతీల వాలంటీర్లు పెద్ద ఎత్తున హాజరుకావాలని మండల వాలంటీర్ల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జీకే వీధిలో నిర్వహించిన సమావేశంలో మండల వాలంటీర్ల అధ్యక్షుడు గెమ్మెల కోటి, ఉపాధ్యక్షుడు డి. మురళీమోహన్, కార్యదర్శి పి. భాస్కర్ రావు మాట్లాడారు. రాజీనామా చేసిన వారు, చేయని వారు అనే తేడా లేకుండా మండలంలోని అన్ని పంచాయతీల వాలంటీర్లు మహాగర్జనలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా విధులకు దూరమైన వాలంటీర్లందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మహాగర్జన ద్వారా ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించనున్నట్లు తెలిపారు. అరకులో జరిగే మహాగర్జనను విజయవంతం చేసేందుకు జీకే వీధి మండలంలోని అన్ని పంచాయతీల వాలంటీర్లు భారీ సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## పద్మనాభం సి ఐ గా ఎం చంద్రమౌళి బాధ్యతల స్వీకరణ



**పెన్ పవర్ న్యూస్ పద్మనాభం :** పద్మనాభం మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా ఎం చంద్రమౌళి శుక్రవారం అధికారకంగా బాధ్యతలు స్వీకరించారు ఇంతకుముందు విశాఖపట్నం వెస్ట్ క్రైమ్ సిఐ గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై పద్మనాభం సర్కిల్ కు నియమితులయ్యారు. కొత్త సీఐ గా బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళి శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తామని తెలిపారు స్థానికులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఇక్కడ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన సిహెచ్ శ్రీధర్ విశాఖపట్నంలో ఏ ఆర్ కు బదిలీ అయ్యారు.

# 767 కిలోల గంజాయి బూడిద...





- యువత భవిష్యత్తును కాపాడిన భారీ ఆపరేషన్
- పరవాడలో భారీ డ్రగ్స్ నిర్మూలన..
- నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో -- ఈగల్ సంయుక్త చర్య
- ఆరు కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, గంజాయి నూనెను శాస్త్రీయ విధానంలో ధ్వంసం

**అనకాపల్లి, పెన్ పవర్ జూలై 10 :**ఒక్కసారి ఆలోచించండి... ఈ 767 కిలోలకుపైగా గంజాయి, నాలుగు లీటర్లకు పైగా గంజాయి నూనె అక్రమ రవాణాదారుల చేతుల్లోనే ఉండి ఉంటే... ఎంతమంది యువకులు మత్తు వ్యసనాలకు బానిసలయ్యేవారు? ఎన్ని కుటుంబాలు విషాదంలో మునిగిపోయేవి? అలాంటి ప్రమాదాన్ని అడ్డుకుంటూ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), రాష్ట్ర ప్రభుత్వ ఈగల్ విభాగం సంయుక్తంగా చేపట్టిన భారీ నిర్మూలన చర్యలో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయి.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నమోదైన ఆరు వేర్వేరు కేసుల్లో ఎన్‌సీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న 767.5 కిలోల గంజాయి, 4.036 లీటర్ల గంజాయి నూనెను శుక్రవారం అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తానం గ్రామంలోని రామ్‌కీ ఫార్మా పరిశ్రమలో ఉన్న అత్యాధునిక దహన కేంద్రంలో శాస్త్రీయ విధానంలో నిర్వీర్యం చేశారు.
సాధారణంగా బహిరంగంగా కాల్చకుండా, కాలుష్య నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రత్యేక యంత్రాల సహాయంతో అత్యధిక ఉష్ణోగ్రత వద్ద మత్తు పదార్థాలను పూర్తిగా దహనం చేశారు. దీంతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా మొత్తం ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఈగల్ విభాగం పోలీసు సూపరింటెండెంట్ జి. స్వరూపరాణి, ఎన్‌సీబీ ప్రాంతీయ సంచాలకుడు పంకజ్ కుమార్ ద్వివేది ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎన్‌సీబీ సూపరింటెండెంట్ రాజన్ కుమార్, నిఘా అధికారి కె. కిరణ్ బాబు, ఈగల్ విభాగం తనిఖీ అధికారులు జి. దేముళ్లు, డాక్టర్ కల్యాణి, అనకాపల్లి ఈగల్ సెల్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను మత్తు వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.
పట్టుబడిన ప్రతి మత్తు పదార్థాన్ని కోర్టు అనుమతి పొందిన అనంతరం చట్టబద్ధంగా, శాస్త్రీయ విధానంలో ధ్వంసం చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ మాఫియాపై ఎలాంటి రాజీ ఉండదని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతూనే ఉంటామని హెచ్చరించారు.
యువత భవిష్యత్తును కాపాడే ఈ చర్యతో ఒకవైపు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పూర్తిగా అంతమవగా, మరోవైపు డ్రగ్స్ అక్రమ రవాణాదారులకు ప్రభుత్వం గట్టి హెచ్చరిక పంపినట్లయిందని అధికారులు పేర్కొన్నారు.

# రావణ్ అండ్ కో వెనుక ఉన్నది వైసీపీయే!

ఆంధ్రప్రదేశ్ జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆరోపణ



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 10:**రావణ్ అండ్ కో వెనుక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందని, రాష్ట్రంలో క్రైస్తవులను రెచ్చగొట్టి మత ఘర్షణలు సృష్టించేందుకు కుట్ర జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం--అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య ఆరోపించారు. పాడేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రావణ్‌తో కలిసి పనిచేసిన వ్యక్తులు సరిపోక, ఇప్పుడు నేరుగా వైసీపీ నేతలే రంగంలోకి దిగారని ఆరోపించారు. యూపీఏ కేసులో అరెస్టైన రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వైసీపీ ప్రకటించడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, అయినప్పటికీ కొందరు కావాలనే క్రైస్తవులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియాలో హిందూ దేవతలను, సనాతన ధర్మాన్ని కించపరిచేలా కొందరు వ్యక్తులు, యూట్యూబ్ ఛానళ్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఏలూరులో నిర్వహించిన దళిత క్రైస్తవ శంఖారావం సభలో దళితులు, క్రైస్తవుల సంక్షేమంపై కాకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారని గంగులయ్య ఆరోపించారు. దేశ సమైక్యత, సనాతన ధర్మ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొన్ని వర్గాలు పనిచేస్తున్నాయని అన్నారు. జడ శ్రావణ్ కుమార్ తాను జగన్‌పై పోరాటానికి రూ.25 కోట్లు ఖర్చు చేశానని చెప్పారని, అంత డబ్బు ఆయనకు ఎలా వచ్చిందో ప్రజలకు వివరించాలని గంగులయ్య డిమాండ్ చేశారు. న్యాయవాదిగా పెద్దగా ప్రాక్టీస్ చేయని వ్యక్తికి అంత ఆస్తి ఎలా సమకూరిందో వెల్లడించాలని కోరారు. సుగాలి ప్రీతి కుటుంబానికి సంబంధించి జడ శ్రావణ్ కుమార్‌పై వస్తున్న ఆరోపణలు, బార్ కౌన్సిల్ రికార్డుల్లో ఉన్న వివరాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రావణ్, శ్రావణ్, ప్రకాష్ రాజ్‌ల మధ్య ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలపై కూడా దర్యాప్తు జరగాలని కోరారు. రాష్ట్రంలో మత ఘర్షణలు రెచ్చగొట్టేందుకు ఏవైనా కుట్రలు జరుగుతున్నాయా అనే కోణంలో పోలీసులు సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని గంగులయ్య పేర్కొన్నారు.

## మంచినీటి సమస్యకు పరిష్కారం దిశగా అడుగు.. ఎస్ఆర్ నగర్‌లో బోరు పనులు

- బోరు తవ్వకాలు పరిశీలించిన ఆర్డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ బాబు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ నగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన బోరు తవ్వకాల పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, దామనపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి కళ్యాణ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఎస్ఆర్ నగర్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో తమ గ్రామానికి బోరు మంజూరు చేసి శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు ఇటీవల పాడేరులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన అధికారులు బోరు మంజూరు చేయగా శుక్రవారం బోరును తవ్వారు. పనుల నాణ్యత, పురోగతిపై జేఈ కళ్యాణ్‌బాబు సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, బీజేపీ నాయకుడు డి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణ పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- అటవీ సంరక్షణ చర్యలు పటిష్టం చేయాలి.
- చింతపల్లి డివిజన్‌లో విశాఖ సీసీఎఫ్ ఐకేవీ రాజు విస్తృత పర్యటన.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 10.**అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖపట్నం ముఖ్య అటవీ సంరక్షణ అధికారి (సీసీఎఫ్) ఐ.కే.వి. రాజు సూచించారు. శుక్రవారం ఆయన చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలో విస్తృత పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా చింతలూరులోని టింబర్ డిపోను సీసీఎఫ్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న కలప (టింబర్) విక్రయాల ప్రక్రియను, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ?అనంతరం చింతపల్లిలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయానికి చేరుకున్న సీసీఎఫ్ రాజు.. డివిజనల్ అటవీ అధికారి (డీఎఫ్ఓ) వై.వి. నరసింహారావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో అటవీ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, అక్రమ కలప రవాణా అరికట్టడం తదితర కీలక అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటుతూ.. స్థానిక అధికారులతో కలిసి కార్యాలయ ఆవరణలో ఆయన ఉత్సాహంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు అప్పారావు, వెంకట్రావు, ప్రశాంతి, ట్రైనీ రేంజ్ ఆఫీసర్ మణికృష్ణతో పాటు పలువురు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సత్యవరం పాతవీధి రహదారి కష్టాలకు మోక్షం.

- రూ.5 లక్షల జెడ్పీ నిధులతో రెండు కల్వర్టుల నిర్మాణం.
- పనులకు శంకుస్థాపన చేసిన జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 10.** మండలంలోని చౌడుపల్లి పంచాయతీ సత్యవరం గ్రామంలోని పాతవీధి వాసుల చిరకాల సమస్య పరిష్కారానికి మోక్షం కలిగింది. దారి లేక ఇబ్బందులు పడుతున్న ఆ వీధి ప్రజల కష్టాలను తీర్చేందుకు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య శుక్రవారం రెండు కల్వర్టుల నిర్మాణ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాతవీధికి సరైన రహదారి సౌకర్యం లేక స్థానికులు పడుతున్న అవస్థలను తాజామాజీ సర్పంచ్ తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, కల్వర్టుల నిర్మాణం కోసం వెంటనే జెడ్పీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులతో రెండు కల్వర్టులను నిర్మిస్తున్నామని, తద్వారా స్థానికుల రాకపోకల సమస్య చాలావరకు తీరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పాతవీధికి పూర్తిస్థాయిలో పక్కా రహదారి నిర్మించేందుకు తన వంతుగా గట్టి కృషి చేస్తానని గ్రామస్తులకు ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తమ దశాబ్దాల సమస్యను గుర్తించి కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జెడ్పీటీసీ బాలయ్యకు, ఇందుకు చొరవ చూపిన తాజామాజీ సర్పంచ్ లలితకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు గెమ్మెలి సింహాచలం, కోరాబు కరుణానిధి, యువజన నాయకుడు వండలం చంటి, కూటమి నాయకుడు సొలబం నాగం నాయుడు, గ్రామ పెద్దలు గణపతి, వెంకట్రావు, రమేష్, సింహాచలంతో పాటు తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్మశాన వాటిక స్వచ్ఛమైనగెడ్డ, నేడు వ్యర్థాలకు అడ్డా.

- చౌడుపల్లి వంతెన పైనుంచి యథేచ్ఛగా కోళ్లు, చేపల వ్యర్థాల పారబోత.
- మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడే ప్లాస్టిక్ కవర్లలో మాంసం, చేపల వ్యర్థాలు.
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 10.**ఒకప్పుడు గ్రామస్తుల దైనందిన జీవితంలో మమేకమైన ఓ పారే జలవనరు ఇప్పుడు కొందరి స్వార్థం, అధికారుల ఉదాసీనత వల్ల కాలుష్య కాసారంగా మారింది. చింతపల్లి సమీపంలోని చౌడుపల్లి వంతెన కింద ప్రవహించే పారేగెడ్డ నేడు మురుగు కాలువను తలపిస్తోంది. స్థానిక మాంసం, చేపల విక్రయదారులు విచ్చలవిడిగా వ్యర్థాలను తెచ్చి గెడ్డలో పారబోస్తుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. కనీసం అటువైపు వెళ్లాలన్నా గ్రామస్తులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చింతపల్లి గ్రామస్తులకు ఈ గెడ్డతో విడదీయరాని అనుబంధం ఉంది. కొన్నేళ్ల క్రితం వరకు స్థానిక మహిళలు బట్టలు ఉతుక్కోవడానికి ప్రధానంగా ఈ నీటిపైనే ఆధారపడేవారు. అంతకంటే ముఖ్యంగా గ్రామ శ్మశానవాటిక ఈ గెడ్డకు అత్యంత సమీపంలో ఉండటంతో, గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు పూర్తయిన తర్వాత ఇక్కడే స్నానాలు ఆచరించి ఇళ్లకు వెళ్లడం ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ. విషాద సమయంలో పవిత్రంగా భావించి స్నానాలు చేసే ఈ గెడ్డ, నేడు కనీసం కాలు మోపడానికి కూడా వీల్లేని దయనీయ స్థితికి చేరుకోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌడుపల్లి వంతెన పైనుంచి కొందరు వ్యాపారులు కుళ్లిన చేపలు, కోళ్ల పేగులు, ఈకలను నేరుగా గెడ్డలోకి విసిరేస్తున్నారు. ఈ వ్యర్థాలు కుళ్లిపోయి నీటిలో కలిసిపోవడంతో అంత్యక్రియల అనంతరం స్నానం చేద్దామని వచ్చే వారు, ఆ దుర్వాసనను చూసి నీటిలోకి దిగలేక వెనుతిరుగుతున్నారు. ఇదొక్క చౌడుపల్లి వంతెన వద్దే కాదు, మండల కేంద్రంలో ఏ మూల చూసినా మాంసం, చేపల వ్యర్థాలు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. దుకాణదారులు కుళ్లిన మాంసం, పేగులు, ఈకలను ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇష్టమొచ్చిన చోట అడ్డగోలుగా పారేస్తున్నారు. వాస్తవానికి ఈ వ్యర్థాలను పంచాయతీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్దే వేయాల్సి ఉన్నప్పటికీ, వ్యాపారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు రోగాల బారిన పడేందుకు కారణమవుతున్నాయి. వర్షాకాలం కూడా సమీపిస్తుండటంతో ఈ కలుషిత వాతావరణం వల్ల గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ, పట్టించుకోని అధికారులు

కళ్లెదుటే పారే నీటి వనరు నాశనమవుతున్నా, వీధులన్నీ వ్యర్థాలతో నిండిపోతున్నా స్థానిక పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాంసం, చేపల విక్రయదారులపై అధికారుల పర్యవేక్షణ, కఠినమైన ఆంక్షలు, సరైన మార్గదర్శకాలు లేకపోవడం వల్లే వారు ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్ర వీడి, నిర్ణీత డంపింగ్ యార్డులోనే వ్యర్థాలు వేసేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కడపడితే అక్కడ, ముఖ్యంగా వంతెన పైనుంచి గెడ్డలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధించాలని కోరుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణం స్పందిస్తేనే గ్రామానికి, పారేగెడ్డకు ఈ కాలుష్య కోరల నుంచి విముక్తి లభిస్తుందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## హుకుంపేటలో సరవేగంగా సాగుతున్న సర్ కార్యక్రమం.

- అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి.
- అరకు నియోజవర్గం తెలుగుదేశం మహిళ అధ్యక్షురాలు సిరగం సూర్యకాంతం



**హుకుంపేట పెన్ పవర్ జూలై 10:**హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ హుకుంపేట గ్రామం లో నేడు ప్రజలకు సార్ స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఓటర్ జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, దిద్దుబాట్లకు సంబంధించిన విధివిధానాలను వివరించారు ప్రతి అర్హుడైన పౌరుడు తమ పేరును ఓటర్ జాబితాలో సరిగ్గా నమోదై ఉండేలా చూసుకోవడం ప్రతి ఓటరు బాధ్యత అని, సార్ ప్రక్రియలో పాల్గొన్న అరుకు తెలుగుదేశం మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం అన్నారు. ఓటు నమోదుపై మరియు సవర్ణ వంటి వాటిపై. ఎటువంటి సందేహాలు ఉన్నా స్థానిక బూత్ లెవల్ అధికారులను మరియు బూత్ ఏజెంట్స్ లకు కుడా సంప్రదించవచ్చని ఆమె అన్నారు

ఈ కార్యక్రమంలో వీఆర్వో రత్నకుమారి బి ఎల్ ఓ. సర్వేయర్ సాయికిరణ్ బిఎల్ఎ కాసులు గోవింద్. బీసీ సెల్ గిడుతూరి సన్యాసిరావు. తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 13 నుంచి అరకు ప్రభుత్వ ఆర్ ఐటీఐలో ప్రవేశాలకొరకు కౌన్సెలింగ్.

ప్రిన్సిపాల్ వై. రామ్మోహనరావు.




**చింతపల్లి పెన్ పవర్ జూలై 10.**ఐటీఐలో ప్రవేశాలకు సంబంధించి మొదటి విడత దరఖాస్తుదారులకు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అరకు ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చింతపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సాధించిన ర్యాంకులు, పదో తరగతి గ్రేడ్ల ఆధారంగా విడతల వారీగా ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను ఆయన వెల్లడించారు. 13వ తేదీన 1 నుంచి 435 వరకు ర్యాంకు సాధించి, పదో తరగతిలో 7 నుంచి 10 లోపు గ్రేడ్ పాయింట్లు వచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అలాగే 14వ తేదీన 436 నుంచి 995 ర్యాంకు, 5.3 నుంచి 6.8 గ్రేడ్లు సాధించిన వారికి ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇక 15వ తేదీన 996 నుంచి 1630 వరకు ర్యాంకుతో పాటు 5.2, ఆ దిగువన గ్రేడ్లు వచ్చిన విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తమకు కేటాయించిన తేదీల్లోనే అరకు ఆర్ ఐటీఐ కేంద్రానికి చేరుకోవాలని, తప్పనిసరిగా తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని ప్రిన్సిపల్ రామ్మోహనరావు సూచించారు

## నీలకంఠాపురం ఎస్ఐగా రమేశ్ నాయుడు.బదిలీ



**కురుపాం జూలై 10 పెన్ పవర్.**మండలంలో నీలకంఠాపురం ఎస్సైగా పీ.రమేశ్ నాయుడును శక్రవారం నాడు బాధ్యతలు చేపట్టారు.ఈ మేరకు పి.రమేష్ నాయుడు మాట్లాడుతూ,ఇప్పటివరకు పార్వతీపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్సైగా విధులు నిర్వహించానని.గురువారం నాడు ఎస్పీ మాధవరెడ్డి.నిర్వహించిన బదిలీలలో నీలకంఠాపురం పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారన్నారు.కాగా జిల్లాలో మొత్తం ఏడుగురు ఎస్ఐలకు బదిలీలు జరగాయన్నారు.

## ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించిన డిఎంహెచ్ఓ

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.




**కురుపాం జులై 10 పెన్ పవర్.** మండలంలో ప్రత్యేక వైద్య శిబిరాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డిఎంహెచ్ఓ) ఆకస్మిక తనిఖీలు చేశారు.కురుపాం మండలం మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మంత్రజోల గ్రామంలో శు క్రవారం నాడు నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఓ.డాక్టర్ ఎస్ ప్రభాకర్ రావు ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ మేరకు డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ.ఇప్పుడు ఉండేది వర్షాకాలం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ జ్వరాలు,వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ చుట్టుప్రక్కల ఎక్కడ నీరు నిలువ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు.అనంతరం గ్రామాల్లో,లార్వా వేట,డ్రై డే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అధికారులు అసలు ప్రజలు పాల్గొన్నారు.

## నేను ఎప్పటికీ గిరిజన ప్రాంత ప్రజల సేవకుడునే...!




- కొత్తపల్లిలో ఆత్మీయ కలయిక
- గ్రామస్తులతో కుటుంబ సభ్యులతో ఆప్యాయతంగా ముచ్చట

**పెన్ పవర్ జూలై 10:**గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అందరూ సమిష్టిగా కృషి చేసినప్పుడే సాధ్యమవుతుందని వైఎస్ఆర్సిపి నాయకులుమాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలో అంతాడ పంచాయితీ కొత్తపల్లి లో మాజీ సర్పంచ్ సుర్ల చంద్రరావు అధ్యక్షతన ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పసుపులేటి బాలరాజు మాట్లాడుతూ... మన్యంలో తనను ఇంతగా అభిమానించే ప్రతి ఒక్కరి కి రుణపడి ఉంటానని అన్నారు. తాను ఈ స్థాయికి రావడానికి రాజకీయాలకు వర్గాలకు అతీతంగా అనేకమంది కృషి చేశారని గుర్తు చేశారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేసిన సమయంలో తాను తిరగని ప్రాంతం అభివృద్ధి చేయని ప్రదేశాలు లేవని అన్నారు ఇప్పటికి తమ హాయామములో నిర్మించిన భవనాలు మంచినీటి సౌకర్యం రహదారులు గురించి చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు మన్యంలో కూటమి ప్రభుత్వం నిర్మిస్తున్న రహదారులు ప్రయాణికులు సౌకర్యార్థం నిర్మించాలాని, ఆ రహదారుల్లో అంబులెన్స్ ఆర్టీసీ బస్సులు తిరిగే విధంగా నాణ్యతగా ఏర్పాటు చేయాలన్నారు. తాను వైఎస్ఆర్సిపి నాయకుడిగానే కాకుండా గిరిజన ప్రాంత వ్యక్తిగా నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తుతానని అన్నారు. ముందుగా బంగారం పేట, తాటిమనిపాలెం, కొత్తపల్లి లో మహిళలు సాధర స్వాగతంతో పువ్వులు చల్లుతూ నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రేగటి ముసలి నాయుడు, జుర్రా రాంబాబు, కొయ్యూరు సొసైటీ డైరెక్టర్ రీమల చంద్రరావు తోపాటు మాజీ ఎంపీటీసీలు ఆయన అభిమానులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు కొత్తపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు

## బాలారం గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మినరల్ వాటర్ ప్లాంట్‌ఏర్పాటుకు చర్యలు...!

రామ్ కి ఫౌండేషన్ డైరెక్టర్నికోరిన ఎం.వి.వి.ప్రసాద్

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 10 :**కొయ్యూరు మండలం బాలారం పంచాయతీ పరిధిలోని బాలారం గ్రామంలో పలువురు ప్రజలు మూత్రపిండాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రాంకీ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ శ్రీ ఎం.వి.వి. ప్రసాద్ కోరారు.

ప్రజల ఆరోగ్య సమస్యలను వివరించి, ఈ ప్రాంతానికి మినరల్ వాటర్ ప్లాంట్ అవసరాన్ని తెలియజేయగా శ్రీకాంత్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా బాలారం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 6 పంచాయతీల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది.

ఈ కార్యక్రమంలో అప్పన్న, ఆనంద్, సూరిశెట్టి రమణ, ఇందన



సత్యనారాయణ, మొండెం రాము మువ్వల గిరి తదితరులు పాల్గొన్నారు.

## గూడెం కొత్తవీధి మండలంలో చురుగ్గా ఎస్ఐఆర్ ఓటరు సర్వే




- బిఎల్ఓ లకు బిఎల్ఎ లు సహకరించాలన్న వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్
- గ్రామసభల్లో పాల్గొన్న తహసీల్దార్ అన్నాజీరావు

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 10:**గూడెం కొత్తవీధి మండలంలో ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) సర్వే చురుగ్గా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం రింతాడ, సంకాడ, పెదవలస గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు తహసీల్దార్ అన్నాజీరావు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ హాజరయ్యారు. ఓటరు సర్వే తీరును పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కంకిపాటి గిరిప్రసాద్ మాట్లాడుతూ, మండలంలోని సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు 75 శాతం సర్వే పూర్తయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), పార్టీ నాయకులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను యుద్ధప్రాతిపదికన బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) అందజేయాలని కోరారు.అలాగే మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు, నకిలీ (డబుల్) ఓట్లను గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్సీపీ నాయకులు కంకిపాటి నారాయణ, లంబసింగి రమేష్, వంతల చంటిబాబు, సంకాడ మాజీ వైస్ సర్పంచ్ మడతల సోమేష్, బొబ్బిలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## 72 వార్డ్ లో స్పెషల్ ఇన్వస్టుగేషన్ రివిజన్



**గాజువాక :పెన్ పవర్ ,జులై 10** చిన్నగంట్యాడ ఆర్ ఆర్ ఆర్ సెంట్రల్ హాల్లో 72వ వార్డ్ సర్ స్పెషల్ ఇన్వస్టుగేషన్ రివిజన్ కార్యక్రమం నిర్వహించారు . సమావేసంలో ఇన్ చార్జి బి ఎల్ ఓలు రాజా దేవి, 114 బూతు శివ, 115 బూతు శాంతి, 116 బూతు ఝాన్సీ , 121 బూతు వీర్రాజు , ఆర్ పిలు నాగ్ మణి , శ్రీలక్ష్మి పాల్గొని ఓట్లు మీద వివిధ అంశాలు మీద మాట్లాడారు . 72వార్డ్ వైసిపి ఇన్ చార్జ్ సిరట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు అయిదు వందల దొంగ ఓట్లు వున్నాయని , లిస్టు లో పేర్లు వున్నాయని , కానీ మనుషులు 72 వ వార్డు కి సంభందించిన వారు కాదని ఈ విషయంలో సర్ అధికారులు చొరవచూపించాలి అని కోరారు . టిడిపి 72 వార్డ్ నాయకులు కన్నారావు మాట్లాడుతు ఈ నెల 14 వ తేదీకి ఈ సర్ కార్యక్రమం ముగిసేటట్లు సహకరించాలని కోరారు. టిడిపి 114 బూత్ ఇన్ చార్జ్ ఏవి యన్ యమ్ అప్పారావు సలహా యిస్తూ తన వంతు కర్తవ్యం గా తెలిసిన అన్ని గ్రూపులలో సర్ గురించి వివరించే పోస్ట్ చెయ్యడంవలన స్పందన వచ్చింది, మిగిలిన వారు కూడా పై విధంగా ప్రచారం చేస్తే ఓటర్ నమోదు కార్యక్రమం లో ఫలితాలు వస్తాయని సలహా ఇచ్చారు. ఈ సమావేసం లో బిజేపి నుండి టి. చంద్రశేఖరావు , టిడిపి నుండి తుమ్మల నాగేశ్వరావు , డి. గాంధీ , జి బసవరాజు , వరలక్ష్మి , గోవింద్ పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు మీ భద్రత కోసమే.. ఎస్సై సురేష్ సూచన

- హెల్మెట్ ధరించండి.. సురక్షితంగా ఇంటికి చేరండి



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 10:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం పెదవలస గ్రామంలోని జాతీయ రహదారి--516ఈ పై ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వాహన తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పత్రాలు సక్రమంగా లేని వాహనదారులను గుర్తించి ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని వివరించారు. అలాగే వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించరాదని, ట్రాఫిక్ సంకేతాలు, రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతగా పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనండి :బొండా



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జులై 10** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డ్ పరిధిలో ఎస్ ఐ ఆర్ బూత్ లెవెల్ లో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల ప్రవేశపెట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఇంటికి వచ్చిన బిఎల్ఓ మరియు బిఎల్ఏ లకు సహకరించి వారిచ్చే ఓటర్ పత్రాలను నింపి వారికి అందిస్తే మన ఓటు భద్రంగా ఉంటుందని దీనికి అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బొడ్డేటి సత్తిబాబు, మల్ల రాము, బొడ్డేటి దేముళ్ళు, బిఎల్ఓ, బి ఎల్ ఏ, ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

## మధురమామిడి ఎస్టి థామస్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**జి.మాడుగుల.పెన్ పవర్.జూన్ (10)** పాడేరు సెంటెన్స్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హెడ్ మాస్టర్ గోపాల్ రావు వెల్లడిశీచారు ఈ కార్యక్రమానికి వచ్చిన వారు ఆధార్ కార్డు అలాగే వారి పాత మెడికల్ రిపోర్ట్స్ తీసుకు రాగలరని కోరారు

ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను కూడా ఉచితంగానే పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు టైఫాయిడ్, మలేరియా వంటి ఇతర రక్త పరీక్షలను కూడా ఉచితంగా చేస్తారని హెడ్ మాస్టర్ వివరించారు. ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 04:00 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# ఈఈఈ విద్యార్థులకు ఎలక్ట్రిక్ వాహనాలపై వర్క్‌షాప్ నిర్వహించిన విజ్ఞాన్



**కూర్మన్నపాలెం ;పెన్ పవర్ ,జులై 10** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ ఈఈఈ విద్యార్థుల కోసం ఎలక్ట్రిక్ వాహనాల రూపకల్పన మరియు సాంకేతికత అంశంపై జూలై 8 నుంచి 10 వరకు మూడు రోజుల ప్రాక్టికల్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో ఉపాధి అవకాశాలకు సిద్ధం చేయడమే ఉద్దేశ్యం అని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది . వర్క్‌షాప్‌లో ఎలక్ట్రిక్ వాహనాల నిర్మాణం, బ్యాటరీ సాంకేతికత, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బీఎంఎస్, పర్మనెంట్ మ్యాగ్నెట్ సింక్రోనస్ మోటార్లు పీఎంఎస్ఎమ్, మోటార్ కంట్రోలర్లు, ఛార్జింగ్ వ్యవస్థలు, రీజెనరేటివ్ బ్రేకింగ్ వంటి కీలక అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. కార్యక్రమంలో భాగంగా బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ, ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాల డిస్‌అసెంబ్లీ మరియు అసెంబ్లీపై నిర్వహించిన ప్రాక్టికల్ సెషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటి ద్వారా విద్యార్థులు ఎలక్ట్రిక్ వాహనాల నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, లోపాల నిర్ధారణ, నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు.

మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో మొత్తం 75 మంది తుది సంవత్సరం ఈఈఈ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాయోగిక ప్రదర్శనలు, పరస్పర చర్చల ద్వారా తరగతి గది బోధనకు, పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తూ విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో దోహదపడింది. కార్యక్రమం ముగింపులో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులు నిపుణులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఈ కార్యక్రమానికి విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ కె. కె. దీపిక సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టర్ డాక్టర్ వి. మధుసూదనరావు, విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పూడి శేఖర్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడంలో ఇటువంటి ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించి ఉపాధి అవకాశాలను మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు.

## పెందుర్తి జోనల్ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్





- ఆర్‌టీఐ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి
- రికార్డుల నిర్వహణ, పారదర్శకతపై అధికారులకు కీలక ఆదేశాలు

**పెందుర్తి, పెన్ పవర్, జూలై 10 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్.నాయుడు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్, పెందుర్తి జోనల్ కార్యాలయాన్ని సందర్శించి, సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ--2005) అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆర్‌టీఐ రికార్డులు, దరఖాస్తుల పరిష్కార విధానం, సంబంధిత రిజిస్టర్లు, పత్రాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. సమీక్ష అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ పి.ఎస్.నాయుడు, సమాచార హక్కు చట్టం కింద అందే ప్రతి దరఖాస్తును చట్టంలో నిర్దేశించిన గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులకు పూర్తి, ఖచ్చితమైన, స్పష్టమైన సమాచారాన్ని సానుకూల దృక్పథంతో అందించాలని సూచించారు. అలాగే కార్యాలయ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు సమాచారం అందించే ప్రక్రియను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఆర్‌టీఐ చట్టంలోని ప్రతి నిబంధనను కచ్చితంగా పాటిస్తూ, సమాచార కమిషన్ జారీ చేసే మార్గదర్శకాలను విధిగా అమలు చేయాలని ఆదేశించారు. పెందుర్తి జోన్‌లో సమాచార హక్కు చట్టం అమలు తీరును పరిశీలించిన అనంతరం, అక్కడి అధికారుల పనితీరుపై రాష్ట్ర సమాచార కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఈ చట్టం అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర సమాచార కమిషనర్ తో పాటు జడ్సీ శంకర్రావు, ఏసీపి రామలింగేశ్వర్ రెడ్డి, సూపర్డెంట్ శ్రీనివాస్ మూర్తి, కృష్ణారావు, ఇతర సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## విశాఖ పశ్చిమలో అభివృద్ధి పరుగులు

- 92వ వార్డులో రూ.19లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 10 :** పశ్చిమ నియోజకవర్గం 92వ వార్డులోని ఎస్సీ, బీసీ కాలనీ, వెంకటాపురంలో వార్డు అభివృద్ధిలో భాగంగా రూ.19 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు, 92వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి దాడి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాలనీలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. పనులు పూర్తయితే స్థానికులకు మెరుగైన పారిశుధ్య వాతావరణం, సౌకర్యవంతమైన జీవన పరిస్థితులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నందవరపు సోములు, కంపర ఆనంద్, హేమంత్ వర్మ తదితరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పందన అర్జీకి నెలలోపే పరిష్కారం..

- సిగినపల్లి రామ్‌నగర్ కాలనీలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం
- కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులకు బీజేపీ నేత దుక్కేరి ప్రభాకరరావు, గ్రామస్తుల కృతజ్ఞతలు



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 10:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని సిగినపల్లి రామ్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమంలో ఇచ్చిన అర్జీకి నెల రోజుల్లోనే స్పందించి బోరు తవ్వించి ఇంటింటికీ తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులకు గ్రామస్తులు, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సిగినపల్లి రామ్‌నగర్ కాలనీలో సుమారు 15 కుటుంబాలు, 50 మందికిపైగా ప్రజలు దశాబ్దకాలంగా నివసిస్తున్నారు. అయితే, కాలనీ ఏర్పడిన నాటి నుంచి తాగునీటి సౌకర్యం లేక ప్రజలు కిలోమీటర్ల దూరం నుంచి కాలువ నీటిని తెచ్చుకుని వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని మహిళలు గ్రామ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో గ్రామస్తుల తరఫున బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావు పాడేరులో నిర్వహించిన జిల్లా స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. అర్జీపై స్పందించిన జిల్లా అధికారులు, కూటమి ప్రభుత్వం నిధులతో బోరు తవ్వించి ఇంటింటికీ తాగునీటి సరఫరా కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావుతో పాటు కూటమి నాయకులు సంకోజీ చంటిబాబు, పాంగి రంగారావు, దుక్కేరి బాబురావు, సంకోజీ సింహాచలం, సంకోజీ రామారావు, సంకోజీ మహేష్, కిముదు కృష్ణ, గ్రామ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింహాచల గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 32 కిలోమీటర్ల మార్గాన్ని క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించిన
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ప్రణాళికలు ఈవో





**సింహాచలం, పెన్ పవర్, జూలై 10 :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న పవిత్ర గిరి ప్రదక్షిణ మహోత్సవం కోసం జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ మహోత్సవాన్ని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఎం.అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావుతో కలిసి కలెక్టర్ గిరి ప్రదక్షిణకు సంబంధించిన 32 కిలోమీటర్ల మార్గాన్ని క్షేత్రస్థాయిలో సుదీర్ఘంగా పరిశీలించారు. జోడిగుడ్లపాలెం, అప్పుఘర్, మాధవధార, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీ, వసతులు, ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. తొలి పావంచ వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టే ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ భక్తులు సురక్షితంగా మొక్కులు తీర్చుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా మార్గాలను విస్తరించడం, అవసరమైన చోట్ల బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గత సంవత్సరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ, అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్య కూడళ్ల వద్ద దిశానిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులు, వృద్ధుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, గిరి ప్రదక్షిణకు వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గిరి మార్గం మొత్తం తాగునీటి కేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు, తాత్కాలిక షెడ్లు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య పనులు, విద్యుత్ వెలుగులు, నిరంతర శుభ్రత వంటి ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని వెల్లడించారు. కీలక ప్రాంతాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ కోసం నియమించనున్నట్లు చెప్పారు. పర్యటనలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఇంజనీర్ (ఐ/సి) రామరాజు, జీవీఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్, అదనపు కమిషనర్ సత్యవేణి, సీఈ సత్యనారాయణరావు, గోపాలపట్నం సీఐ సన్యాసినాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ మహోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన, దేవస్థానం, పోలీసు, జీవీఎంసీ, వైద్య, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తుండటంతో ఈసారి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

# మాకవరం సమీపంలో కాలువలో పడిన కారు పోలీసులు స్వాధీనం

- గంజాయి కారు అనే మాటలో వాస్తవం లేదు.
- జీ మాడుగుల సిఐ లక్ష్మణరావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 10.**మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రం సమీపంలో గల కాలువలో బోల్తా పడి ఉన్న ఒక గుర్తుతెలియని కారును ముంచంగిపుట్టు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ?పోలీసుల కథనం ప్రకారం.. మాకవరం సమీపంలో ఒక వాహనం బోల్తా పడి ఉన్నట్లు పోలీసులకు ఖచ్చితమైన సమాచారం అందింది. దీంతో జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్(సీఐ) లక్ష్మణరావు, ముంచంగిపుట్టు ఎస్ఐ. పి. నాని, పోలీసు సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బోల్తా పడిన కారును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ట్రాక్టర్ సహాయంతో ఆ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసలు ఆ కారు ఎక్కడి నుండి వస్తోంది? ఎక్కడికి వెళ్తోంది? అది ఏ ప్రాంతానికి చెందిన వాహనం? అనే కోణంలో పోలీసులు ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు.

**గంజాయి కారు అంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు**

ఈ సందర్భంగా జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ సీఐ లక్ష్మణరావు శుక్రవారం మాట్లాడుతూ.. సదరు కారులో సుమారు 80 కిలోల గంజాయి ఉందంటూ ఒక పత్రికలో వచ్చిన వార్తను తీవ్రంగా ఖండించారు. ఆ కారులో ఎటువంటి గంజాయి లేదు అయినప్పటికీ అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. కారులో ఎవరు వచ్చారు, ప్రమాదం అనంతరం ఎందుకు వదిలి వెళ్లిపోయారు అనే కోణంలో కూడా విచారణ జరుగుతుందన్నారు. ?గంజాయి లాంటి సున్నితమైన విషయాల్లో



పాత్రికేయులు సంయమనం పాటించాలి. ఏదైనా సమాచారం ఉంటే నేరుగా మమ్మల్ని అడిగి వివరణ తీసుకోవాలి అంతే తప్ప, ఆధారాలు లేకుండా మీకు నచ్చినట్లు ఊహాజనిత వార్తలు రాయడం సరికాదని సీఐ హితవు పలికారు. తప్పుడు వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ?స్పష్టమైన పూర్తి సమాచారంతోనే వార్తలు రాయాలని సీఐ లక్ష్మణరావు సూచించారు. అలా కాకుండా కేవలం ఊహించుకుని, అవాస్తవాలను ప్రచురిస్తే చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయని, అలాంటి వారు శిక్షార్హులు అవుతారన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కానివాడ పంచాయతీలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయం





- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి

**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్, జూలై 10** : గుర్తేడు మండలంలోని కానివాడ పంచాయతీలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ పేర్కొన్నారు.

గుర్తేడు మండలం కానివాడ, కొండ వెజువాడ గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు గ్రామాల సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుర్తేడు మండలం కాని వాడ, కొండ వేజువాడ గ్రామాలలో ఒక నెల ఒక నియోజకవర్గంలో నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని గిరిజనులకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు గ్రామాలలో పర్యటించాలని అన్నారు. గర్భిణీ స్త్రీలకు బాలింతలకు రక్తహీనత లేకుండా అంగన్వాడి కేంద్రాలలో పౌష్టిక ఆహారం అందజేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వచ్చిన సమస్యల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు విద్యుత్ రహదారులు గృహాలు వివిధ రకాల పింఛన్లు ప్రతినెల రేషన్ సకాలంలో పంపిణీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక కుటుంబానికి 125 రోజులు విబిజి రాంజీ పనులు కల్పించడం, వివిధ రకాల సేవలు లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామంలోని పాఠశాల భవనం అంగన్వాడి కేంద్రానికి పక్క భవనాలు ఏర్పాటు చేయాలని ప్రజల కోరిక మేరకు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గుండ్రాల గ్రామంలో గిరిజనులు సాగు చేయుచున్న పసుపు పంటను కలెక్టర్ పరిశీలించి ఎన్ని ఎకరాలు పసుపు పంట వేశారు ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. గుండ్రాల సమీపంలో కాల్వకు కల్వర్టు ఏర్పాటు ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులు కలెక్టర్ ఆదేశించారు. కానివాడ గ్రామసభలో జిల్లా కలెక్టర్ వారికి గ్రామంలో సచివాలయ భవనం హెల్త్ వెల్నెస్ సెంటర్ ఆర్ఎస్కే భవనం పనులు మధ్యలో ఆగిపోయాయని వెంటనే భవనాల పనులు పూర్తి చేయించాలని గిరిజనులు కోరారు. మినీ పప్పుల ప్రాసెసింగ్ మిషన్లు అందజేయాలని కలెక్టర్ కు విన్నవించగా సంబంధిత అధికారులకు ఏర్పాటు చేయడం కృషి చేయడం జరుగుతుందని అన్నారు. రబ్బర్ టాపింగ్ పై రైతులకు శిక్షణ ఇవ్వాలని రబ్బరు రైతులు జిల్లా కలెక్టర్కు తెలియజేయగా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి గుర్తేడు మండలంలోని రబ్బర్ రైతులకు మండల కేంద్రంలో రబ్బర్ టాపింగ్ పై రైతుల శిక్షణ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పెదలోవ మండల పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నది ఎంతమంది విద్యార్థులు ఉన్నది ఆరా తీశారు . కాని వాడ ఘాట్ రోడ్ నుండి ఆహ్లాదకరమైన వ్యూ పాయింట్ని టూరిస్టులు ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 14వ తేదీ వరకు ఓటర్ జాబితాలోమార్పులు చేర్పులకు ఎక్కడికి అక్కడే పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మీ భూమి మీ హక్కు ద్వారా ప్రతి గ్రామంలో రీ సర్వే నిర్వహించుటకు తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. భూములు రీ సర్వే సమయములో సరిహద్దులకు సంబంధించి రైతులు ఇరువురు దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా ఉద్యానవన శాక అధికారి దేవాదానం,నరేంద్ర కుమార్ పంచాయతీ అధికారి నర్సింగరావు, డిఎంఓ భాస్కర్,ఎంపీపీ ఆనంద్, ఐ సి డి ఎస్ పిడి ఉమా,ఎంపీడీవో కే బాపన్న దొర, ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరావు,రవికుమార్ డిఈలు సుబ్బారావు,ఏఈ సత్యనారాయణ,ఉపాధి హామీ ఏపీవో స్వామి, ఏపిఎం రాజబాబు, మాజీ సర్పంచ్ గొర్ల దృశ్యంతుడు, సరంకోట అబ్బాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## మహిళల భద్రత, గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాయిరాం పడాల్



**జి.మాడుగుల. పెన్ పవర్ జూలై (10)** జి.మాడుగుల పోలీస్ స్టేషన్ ఎస్సై సాయిరాం పడాల్, ఏపీఎస్పీ సిబ్బందితో కలిసి పెదలువ్వాసింగి పంచాయతీ పరిధిలోని తియ్యగుండం గ్రామాన్ని సందర్శించి మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ, గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై సాయిరాం పడాల్ మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి సాగు, వినియోగం చట్టవిరుద్ధమని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం.

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.




**గుమ్మలక్ష్మీపురం 10 పెన్ పవర్.**ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు.శుక్రవారం నాడు గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రతి వినతి పత్రాన్ని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్నామని,ప్రజలు ధైర్యంగా తమ సమస్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి,రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదన్ రావు,రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు,గుమ్మలక్ష్మీపురం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే విద్యుత్ కాంతులు.



**కురుపాం జూలై 10 పెన్ పవర్.**కురుపాం మండలం నీలకంఠాపురంలో పట్టపగలే విద్యుత్ కాంతులు రాత్రి పగలూ తేడా లేకుండా లైట్లు వెలగడంతో తొందరగా పోతున్నాయని స్థానికులు తెలిపారు.ఈ మేరకు స్థానికులు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ,మెయిన్ రోడ్డులో ప్రతి స్తంభం వద్ద ఇదే పరిస్థితి ఉందని సంబంధిత అధికారులు స్పందించి పగటి వేళలో లైట్లు ఆపేందుకు స్విచ్ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు ఆపే విషులుపాటు కల్పించాలని సంబంధిత అధికారులకు విన్నపించుకుంటున్నామన్నారు.

# ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇవ్వొద్దు

**ఆదివాసీ సంక్షేమ పరిషత్**

**చింతూరు, పెన్ పవర్, జూలై 10:** పోలవరం ముంపు మండలాల్లో అర్హత లేని గిరిజనేతరులకు పునరావాస, పునఃస్థాపన ప్యాకేజీలు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఈ అంశంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ)కు ఫిర్యాదు చేయగా, కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్, ప్రత్యేక ఆర్అండ్ఆర్ అధికారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచారణకు హాజరైన కుంజా శ్రీను తన బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక ముంపు మండలాల్లో ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ అర్హత లేని గిరిజనేతరులు అక్రమ మార్గాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు పొందుతున్నారని ఆరోపించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో భూములు, వనరులపై హక్కులు స్థానిక ఆదివాసీలకే ఉంటాయని, ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజనేతరులకు ప్యాకేజీలు మంజూరు చేయడం రాజ్యాంగ ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు. ఆర్అండ్ఆర్ సర్వేల్లో స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంతో భారీ అక్రమాలు జరిగాయని, కొందరు గిరిజనేతరులు నాలుగు నుంచి ఐదు ఇళ్లు, వాణిజ్య భవనాలు ఉన్నట్లు తప్పుడు వివరాలు నమోదు చేసి కోట్ల రూపాయల లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో ఓటర్లుగా ఉండి అక్కడ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న వ్యక్తులు కూడా నకిలీ పత్రాలతో ముంపు ప్రాంతాల్లో ప్యాకేజీల జాబితాలో చేరినట్లు ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి భారీ ప్యాకేజీలు పొందిన గిరిజనేతరులు తిరిగి ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ, ఆదివాసీల భూములను ఆక్రమించి స్థిరపడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



ఆదివాసీలు తమ పూర్వీకుల భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజనేతరులకు విక్రయించవద్దని సూచించారు. ఏజెన్సీ రక్షణ చట్టం 1/70 (ఎల్‌టీఆర్) నిబంధనలను ఉల్లంఘించి గిరిజనేతరులకు పోలవరం =ఽ= ప్యాకేజీలు మంజూరు చేస్తే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేపడతామని కుంజా శ్రీను హెచ్చరించారు. ఈ విచారణ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కాకా సీతారామయ్య, యళ్లగడ్డ నాగేశ్వరరావు, పొడియం రాంబాబు తదితర ఆదివాసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏఐసీటీఈ - అఖిల భారత ఇంజనీరింగ్, సాంకేతిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యామండలి సభ్యునిగా నియమితులైన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావుకు అభినందనలు తెలిపిన నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 10.** తాడేపల్లిగూడెం....అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో పనిచేసే అఖిల భారత ఇంజనీరింగ్ మరియు సాంకేతిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యామండలి (ఏఐబియూజి) సభ్యునిగా ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ అఖిల భారత ఇంజనీరింగ్ మరియు సాంకేతిక విద్య అండర్ గ్రాడ్యుయేట్ అధ్యయనాల మండలి సభ్యునిగా తనను నియమించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ బాధ్యతను తనకు అప్పగించిన అఖిల భారత సాంకేతిక విద్యామండలి అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. దేశంలోని ఇంజనీరింగ్ విద్యను మరింత నాణ్యతాపరంగా, సమర్థవంతంగా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దటంలో ఈ మండలి కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ వేదిక ద్వారా విద్యార్థి కేంద్రిత విద్య, ఫలితాల ఆధారిత బోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నవకల్పన, పారిశ్రామిక అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ జాతీయ స్థాయి బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ, భారతదేశ ఇంజనీరింగ్ విద్యాభివృద్ధికి ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని వివరించారు.

ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావుకు వెల్లువెత్తిన అభినందనలు

అఖిల భారత ఇంజినీరింగ్ మరియు సాంకేతిక విద్య అండర్ గ్రాడ్యుయేట్ అధ్యయనాల మండలి సభ్యునిగా నియమితులైన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రామరావుకు ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్లు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి భాధ్యతను విజయవంతంగా నిర్వహిస్తూ, దేశంలోని ఇంజినీరింగ్ విద్యాభివృద్ధికి మరింత సేవలందించాలని, ఏపీ నిట్ కు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## బలుసులమ్మ శాఖాంబరి అలంకరణ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరణ.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 10:** తాడేపల్లిగూడెం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు అర్చనలు జరిగాయి. శుక్రవారం సందర్భంగా అమ్మవారి కి విశేషా పూజలు నిర్వహించారు అనంతరం అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. ఆలయ నిర్వహకులు శ్రీరంగం రామాంజనేయులు (అంజి) ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ చంద్రశేఖర్ నిర్వహణలో, ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ గోపీనాథ్ శర్మ, మల్లిఖార్జునశర్మ అర్చకత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలోని శ్రీ బలుసులమ్మ తల్లి ఆలయంలో ది. 17.07.2026(శుక్రవారం) న జరగనున్న శాఖాంబరి అలంకరణ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని బొలిశెట్టి రాజేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సమాధా కార్యక్రమాన్ని నిర్వహించారు అన్నదానం జరిగింది, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి వారం జరిగే అన్నదానికి భక్తులు అందరు సహకారించాలిన కోరారు,

## గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు చిన్న సత్యవతికి ఘన సన్మానం

### యూటీఎఫ్ గంగవరం మండల శాఖ ఆధ్వర్యంలో సత్కారం



**గంగవరం, పెన్ పవర్ జూలై 10:** గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల నూతన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించిన చెన్నాడ చిన్న సత్యవతిని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) గంగవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 2014 నుంచి 2016 వరకు ఇదే పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలిగా సేవలందించిన చిన్న సత్యవతి, పదోన్నతి పొంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి ఆమె చేస్తున్న కృషిని అభినందిస్తూ యూటీఎఫ్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న చిన్న సత్యవతి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి విద్యారంగానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి కే కృష్ణ ,గంగవరం మండల అధ్యక్షుడు బొజ్జిదొర, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు లోత రుక్మిణి దేవి, మండల కార్యదర్శి రాములకొండ చిన్న వెంకటరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్లో రెండు లక్షల వ్యయంతో సైకిల్ స్టాండ్ నిర్మాణం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 10.** మన తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడు సైకిల్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. సుమారు రెండు లక్షల రూపాయలు వ్యయంతో సైకిల్ స్టాండ్ నిర్మాణానికి ఖర్చవుతుందని. దీనికి ముఖ్య దాతలుగా కీర్తిశేషులు కొండూరు గంగరాజు జ్ఞాపకార్థం వారి సతీమణి మంగ మరియు వారి కుటుంబ సభ్యులు సహకారంతో ఈ శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా జడ్పీ హైస్కూలు డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ అయినటువంటి ఎన్ వి సత్యనారాయణ వారి మిత్రబృందం, పాఠశాల హెచ్ఎం, వాసవి క్లబ్ తాడేపల్లిగూడెం ప్రెసిడెంట్ ఆలపాటి కృష్ణ కుమార్, సెక్రటరీ ముత్తా శ్రీధర్ గుప్తా ట్రెజరర్ పులవర్తి సాయి ప్రశాంత్ జోన్ ఛైర్మన్ పసుమర్తి అనిల్, పాస్ట్ ప్రెసిడెంట్ డిస్టిక్ క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ నున్న సుందరరావు, పూర్వాధ్యక్షులు మండా బ్రహ్మాజీ, మరియు డైరెక్టర్స్ కాజు లక్ష్మయ్య, కొందూరు రాము, కొందూరి శ్రీ రంగనాయకులు హాజరైనారు. ఈ సైకిల్ స్టాండ్ తో పాటు సీనియర్ సిటిజన్స్ నిమిత్తం వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వక్తలు తెలియజేశారు. అదేవిధంగా శాసనసభ్యులు బోలిశెట్టి శ్రీనివాస్ ప్రజల భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమలు చేస్తున్నారని హై స్కూల్ గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ త్వరలో జూనియర్ కాలేజ్ నిర్మాణాలు చేస్తున్నారని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని వక్తలు తెలియజేశారు.

## గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ



**గంగవరం, పెన్ పవర్, జూలై 10:** మర్రిపాలెం సచివాలయం పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పీసా కార్యదర్శి కారం బాపన్నదొర, పీసా ఉపాధ్యక్షుడు రోల్లుపల్లి నూకరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ కొప్పాక కళ్యాణ్ నాయుడు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విజిలెన్సు కమిటీ సభ్యుడు గంగాధరరావును అభినందించిన ఆఫ్కాబ్ ఛైర్మన్ గన్ని



**పెన్ పవర్ -- ఉంగుటూరు । జులై 10:** వెట్టి చాకిరి నిర్మూలన వ్యవస్థ విజిలెన్సు కమిటీ సభ్యునిగా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఇమ్మణి గంగాధరరావును ఆఫ్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అభినందించారు. శుక్రవారం భీమడోలులోని గన్ని క్యాంపు కార్యాలయంలో గంగాధరరావు తన అనుచరులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి తన నియామక విషయాన్ని తెలియజేశారు.

ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ, పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ మూడు పర్యాయాలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సమర్థవంతంగా సేవలందించిన గంగాధరరావుకు కూటమి ప్రభుత్వం సముచితమైన నామినేటెడ్ పదవిని కల్పించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నాచుగుంట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కొరపాటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఘంటా ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వంతెన స్లాబ్ నిర్మాణానికి మట్టి, బురద తొలగింపు పనులు ప్రారంభం



**పెన్ పవర్ -- ఉంగుటూరు । జూలై 10:** రావులపర్రు--ప్రకాశరావుపాలెం రహదారిలో రావులపర్రు--ఉంగుటూరు మధ్య పత్తేపురం పంటకాలువపై నిర్మిస్తున్న వంతెన స్లాబ్ పనుల కోసం అధికారులు శుక్రవారం జేసీబీతో మట్టి, బురద తొలగింపు పనులు చేపట్టారు.

ఈ వంతెన 2018లో కూలిపోవడంతో స్థానిక ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఈ వంతెనతో పాటు కాగుపాడు వెళ్లే కల్వర్టు నిర్మాణాలకు కలిపి రూ. 80 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారుడు పనులు ప్రారంభించి 16 నెలలు గడిచినా ఇప్పటివరకు పూర్తి కాలేదు. కాంక్రీట్ బాటమ్, ఇరువైపుల రిటైనింగ్ గోడలు నిర్మించిన తర్వాత పనులు నిలిచిపోవడంతో పంటకాలువలో నీటి కారణంగా భారీగా మట్టి, బురద పేరుకుపోయింది.

ప్రస్తుతం వంతెన స్లాబ్ నిర్మాణానికి అవసరమైన ఐరన్ సెంట్రింగ్ ఏర్పాటు చేయడానికి వీలుగా ముందుగా మట్టి, బురద తొలగిస్తున్నట్లు ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఇంజనీర్ పి. భాస్కరరావు తెలిపారు.

ఈసారి అయినా వంతెన స్లాబ్ పనులు పూర్తి చేసి ప్రజలకు శాశ్వతంగా రాకపోకల సమస్యలను పరిష్కరించాలని రావులపర్రు గ్రామస్థులు కోరుతున్నారు.

## ఘనంగా జాతీయ చేపల రైతు దినోత్సవం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 10:** జాతీయ చేపల రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడియంలోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ, 1957 జూలై 10న ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఉన్న సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి డాక్టర్ అలీ కున్హీ మెజర్ కార్ప్ చేపల విజయవంతమైన ప్రేరేపిత సంతానోత్పత్తి సాంకేతికతను అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం జూలై 10ను జాతీయ చేపల రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల నాణ్యమైన చేపల విత్తనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, మత్స్యరంగ అభివృద్ధికి ఎంతోదోహదపడిందన్నారు. ప్రపంచంలో మంచినీటి చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలోకొనసాగుతున్నదని పేర్కొన్నారు.

చేపల పెంపకం గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఉపాధి వనరుగా మారి వేలాది కుటుంబాలకు జీవనోపా ధిని కల్పిస్తోందని నిర్మల కుమారి తెలిపారు. చేపలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారమని, ఆహార భద్రతకు కూడా అవి కీలకమని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి చేపల విత్తనాలు వదలడం ద్వారా ఆహార ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని కూడా పెంచవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా అక్వా రైతులు మత్స్యరంగ ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న విశేష సేవలను గుర్తించి సత్కర కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్, అనపర్తి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పులకుర్తి శ్రీనివాసు, శ్రీకృష్ణపట్నం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొల్లాం రత్నంలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఎం. బ్రహ్మానందం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మత్స్య సహకార సంఘం జేఏసీ ఏ. సత్తిబాబు, జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల సభ్యులు, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com